16న బాలానంద సంఘం 85వ వార్షిక వేడుకలు

కాచిగూడ, ఫిబ్రవరి 12: నారాయణగూడలోని ఆంధ్ర బాలానంద సంఘం 85వ వార్షిక వేడుకలు ఈ నెల 16న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు బాలానందం ట్రస్ట్ అధ్యక్షురాలు జేవీ కామేశ్వరి తెలిపారు. బుధవారం బాలానంద సంఘంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. శాసనమండలి సభ్యుడు, కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్, అవినిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు బాలానంద సంఘం 040-27561443 నంబర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్,కార్యదర్శి డాక్టర్ స్వర్ణబాల, తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి రూ. 6.30 కోట్లు

మెహిదీపట్నం ఫిబ్రవరి 12 : గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి రూ. 6.30 కోట్లు మంజూరైనట్లు కార్వాన్ ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ తెలిపారు. బుధవారం టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గోల్కొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పీవీ శ్రీనివాస రావు, ఆర్ఎంఓ రాకేశ్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ కే సంపత్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్‌ను కలిసి దవాఖాన అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఓపీడీ బ్లాక్ నిర్మాణానికి రూ. 4 కోట్ల 50 లక్షలు, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటుకు రూ. కోటి 80 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించి ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా రూపొందిస్తామని ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ తెలిపారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



ప్రేమ్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, ఫిబ్రవరి 12: అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బుధవారం ప్రేమ్‌నగర్ గ్రీన్ ల్యాండ్ వద్ద రూ. 15 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రేమ్‌నగర్‌లో సుమారు రూ. 7.50 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను, అదేవిధంగా రూ. 8 లక్షల అంచనా వ్యయంతో నాలా కనెక్టింగ్ రోడ్డుని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, బీఆర్ఎస్ అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని పీజీ కోర్సుల పరీక్ష తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోల్లో ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్ డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ, ఎంకామ్ (ఐఎస్) తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 18 నుంచి నిర్వహించినట్లు గతంలో ప్రకటించామని గుర్తుచేశారు. పరీక్షలను అదే తేదీ నుంచి ప్రారంభిస్తున్నప్పటికీ, పరీక్షలు నిర్వహించే ఇతర తేదీలను మార్చినట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్ సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

తెలంగాణ జాగృతి క్యాలెండర్ ఆవిష్కరణ

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

గోల్నాక, ఫిబ్రవరి 12 : తెలంగాణ జాగృతి హైదరాబాద్ జిల్లా సీనియర్ నాయకుడు కే.ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం హైదరాబాదులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రతినిధులు పాల్గొన్నారు.

మిలటరీ క్వార్టర్స్‌ను క్రమబద్ధీకరించండి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్

మెహిదీపట్నం ఫిబ్రవరి 12 : కార్వాన్ నియోజకవర్గంలోని టోలిచౌకి ఎండీ లైన్స్‌లో ఉన్న మిలిటరీ క్వార్టర్స్‌ను క్రమబద్ధీకరించాలని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొయినుద్దీన్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కోరారు. ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి టోలిచౌకి ఎండీ లైన్స్‌లో ఉన్న మిలటరీ క్వార్టర్స్ రెగ్యులరైజేషన్ చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా జమాలి కుంట వద్ద రోడ్డును బ్లాక్ చేశారని ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలి

బ్లాక్ స్టిక్కర్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, సీఐ శ్రీనివాస్, సిబ్బంది

కాచిగూడ,ఫిబ్రవరి 12: అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దడానికి ట్రాఫిక్ పోలీసులకు ప్రజలు సహకరించాలని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నింబోలిఅడ్డాలో స్పెషల్ డ్రవ్ నిర్వహించారు. అధిక సౌండ్ పెట్టుకుని తిరుగుతున్న వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించి, కార్ల అద్దాలకు అట్టించిన బ్లాక్ స్టిక్కర్లను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు చేపడుతున్న చర్యలకు వాహనదారులు సహకరించాలని కోరారు. ఫోర్, త్రీ వీల్లర్ వాహనాలకు పరిమితి మించి సౌండ్ ఉండరాదని, పేర్కొన్నారు. నిబంధనలను పాటించని వాహనాల యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఏఎస్సై అనిల్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన కోసం ప్రధానిపై ఒత్తిడి తేవాలి

మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి,తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 12: జనాభా గణనలో కులగణన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి వేలాది మందితో జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అన్నారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులగణనపై ప్రధానిపై బీజేపీ కేంద్ర మంత్రులు ఒత్తిడి తేవాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులగణన చేయడానికి ప్రతిపక్ష, అన్ని రాజకీయ పార్టీలు కేంద్రాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. కులగణన కోసం దేశంలోని బీసీలంతా ప్రధాని మోదీ మెడలు వంచే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట బీసీ దళ్ కార్యకర్తలు ఉన్నారు.

అలరించిన సంగీత విభావరి

ముషీరాబాద్, ఫిబ్రవరి 12: చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంగీత విభావరి పలువురి అలరించింది. ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కెవి రణామాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని మల్లాది ఉష భృందంచే నిర్వహించిన సంగీత విభావరి స్రోతలను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమంలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో బాల్‌రాజ్‌గౌడ్, జీ.సీత, ఉషా తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్ డీ నోటిఫికేషన్ లో మార్పులు చేయాలి



ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశ ప్రక్రియ నోటిఫికేషన్ లో మార్పులు చేయాలని బీఆర్ఎస్వీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. యూనివర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 65ఏండ్లకు పెంచిన నేపథ్యంలో మార్పులు తప్పనిసరి చేయాలని కోరారు. పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. వివిధ రీసెర్చ్ సెంటర్లు, పీజీ సెంటర్ల రిటైర్డ్ ప్రొఫెసర్లకు సైతం గైడ్‌షిప్‌ను ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. బీఆర్ఎస్వీ నాయకులు జంగయ్య, ప్రశాంత్, నాగరాజు, నాగేందర్ పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలతో పాటు బీసీఏ అన్ని సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే బీఏ, బీబీఏ, బీకామ్, బీసీఏ తదితర యూజీ కోర్సులతోపాటు ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ కోర్సు ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ అన్ని ఫలితాలను ఓయూ వెబ్ సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

బీఎఫ్ఏ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ అండ్ ఫోటోగ్రఫీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 19 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న యువకుడిపై కేసు

కాచిగూడ,ఫిబ్రవరి 12: గుట్టుచప్పుడు కాకుండా పేదల ఇండ్లల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొని అధిక ధరలకు అమ్ముతున్న యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హెచ్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటలోని ఎంసీహెచ్ కాలనీకి చెందిన అబ్బాస్(32) పేదలు నివసించే ప్రాంతాలను ఎంచుకుని తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. బుధవారం అడ్డీఖర్కాన నుంచి అబ్బాస్ ఒక క్వింటాల్ రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. నిందితుడు అబ్బాస్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అహ్మద్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజలతో మాట్లాడుతున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, అధికారులు

మెహిదీపట్నం ఫిబ్రవరి 12 : ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గం లోని అహ్మద్‌నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రంజాన్ మాసం సమీపిస్తుండటంతో అధికారులంతా సమన్వయంగా పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

రైల్లోంచి కిందపడి యువకుడు మృతి

కాచిగూడ, ఫిబ్రవరి 12: రైల్లోంచి ప్రమాదవశాత్తు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని యువకుడు(30) మంగళవారం రాత్రి జామై ఉస్మానియా-ఆర్ట్స్ కాలేజ్ రైల్వేస్టేషన్ల మధ్య నడుస్తున్న రైలులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు వంకాయ రంగు టీషర్ట్, నల్ల రంగు జీన్స్ ప్యాంట్ ధరించి, 5.4 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9494824535 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇప్పించండి



ఇంటర్ బోర్డు అధికారి జయప్రదకు వినతిపత్రం అందజేస్తున్న జాజుల లింగం గౌడ్ తదితరులు

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 12 : ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభమవుతున్నందున విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మానసిక నిపుణులచే కౌన్సిలింగ్ ఇప్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ జయప్రదను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు దగ్గర పడుతున్నందున ఇంటర్ విద్యార్థుల్లో ఒత్తిడి పెరిగి భయంతో మానసికంగా కుంగిపోయే అవకాశం ఉందని, విద్యార్థులో ఆత్మనూన్యత భావం ఎక్కువగా ఉంటుందన్నారు. మానసిక నిపుణులతో కౌన్సిలింగ్ ఇప్పించాలని పేర్కొన్నారు. యోగా, మెడిటేషన్ తరగతుల వంటివి నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ స్టేట్ ప్రెసిడెంట్ బూర శ్రీనివాస్,ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ బండి నరేశ్, మాల విద్యార్థి సంఘం స్టేట్ ప్రెసిడెంట్ చంద్రమోహన్ రాయ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

కాచిగూడ,ఫిబ్రవరి 12: బీసీ కులాల సమగ్రాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ కోరారు. బుధవారం నింబోలి అడ్డా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీసీ కులాల ఫెడరేషన్ల నిబంధనలను మార్చాలన్నారు. బీసీ కార్పొరేషన్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలకు నిధులను విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట పి.కృష్ణ, ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్కర్, సత్యపాల్‌సింగ్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కార్ డెకార్స్ దుకాణాల్లో తనిఖీలు

ఎల్బీ స్టేడియం కార్ డెకార్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్

సుల్తాన్ బజార్. ఫిబ్రవరి 12 : సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీ స్టేడియంలోని కార్ డేకార్స్ దుకాణాల్లో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సెంట్రల్ జోన్ ట్రా ఫిక్ డీసీపీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లు వేస్తున్నారని సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్బీ స్టేడియంలోని కార్ డెకార్స్ షాప్‌ల్లో సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. పలు షాపుల్లో భారీగా ఉన్న బ్లాక్ ఫిలిమ్ పేపర్స్ స్వాధీనం చేసుకున్నారు. పలువురు దుకాణదారులకు మొదటిసారిగా హెచ్చరించి వదిలివేశారు. మరికొంతమంది యజమానులకు నోటీసులు ఇచ్చారు.

రాయచూర్ రైల్లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి

కాచిగూడ,ఫిబ్రవరి 12: రాయచూర్ రైలులో అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాయచూర్-కాచిగూడ రైలు బుధవారం కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్-4లో అగింది. గుర్తుతెలియని వృద్ధుడు(75) అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ప్రయాణికుల సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరో వృద్ధుడు..

దవాఖానలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(65)ఈనెల 8న ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాడుతుండగా రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే పోలీసులు వృద్ధుడిని ఉస్మానియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

కాచిగూడ, ఫిబ్రవరి 12: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై డి.సుభాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ ప్రాంతానికి చెందిన కొంపల్లి కిషన్(47) వృత్తిరీత్యా ప్రైవేటు సెక్యూరిటీ గార్డు. మంగళవారం రాత్రి కాచిగూడ బస్ టర్మినల్‌లో గుర్తుతెలియని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కిషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కాగా ప్రమాదం జరిగిన స్థలాన్ని పోలీసులు సీసీ కెమెరాల్లో పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

నీలోఫర్ దవాఖాన టీఎన్జీఓ యూనియన్ నూతన కార్యవర్గం

తెలుగు యూనివర్సిటీ,ఫిబ్రవరి 12: తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ నీలోఫర్ దవాఖాన యూనిట్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కేఆర్ రాజ్‌కుమార్ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎస్. గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా జి. శ్రీనివాస్, కార్యదర్శిగా ఈజే జోయల్, సంయుక్త కార్యదర్శిగా జి.జనార్దన్, కోశాధికారిగా కె.జగన్ మోహన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఐ.సరిత, సభ్యులుగా నాగరాజు, మెహ్మద్ అబ్దుల్ అజీజ్ ఇర్ఫాన్ ఎన్నికైనట్లు తెలిపారు.

ఈనెల 15న మాదాపూర్‌లో జాబ్ మేళా

అబిడ్స్ ఫిబ్రవరి 12 : డెక్కన్ బ్లాస్టర్స్ ఆధ్వర్యంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ మన్నన్‌ఖాన్ ఇంజినీర్ పేర్కొన్నారు. నిరుద్యోగుల కోసం తాము గత కొన్నేండ్లుగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15న హైటెక్ సిటీ మాదాపూర్‌లో జాబ్‌మేళా ఉంటుందని, 70 కంపెనీలు మేళాలో పాల్గొంటున్నాయని, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ప్రతిభ చూపిన వారికి వెంటనే ఆఫర్ లెటర్ అందించనున్నట్లు మన్నన్‌ఖాన్ ఇంజినీర్ తెలిపారు. పూర్తి వివరాలకు 8374315052 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మీ సేవా కేంద్రాల వద్ద జనం.. బారులు

- రేషన్‌కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

నాంపల్లిలోని మీ సేవా కేంద్రం వద్ద దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

అబిడ్స్, ఫిబ్రవరి 12: రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణకు మీ సేవా కేంద్రాలకు అనుమతి ఇవ్వడంతో ప్రజలు మీ సేవా కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. సర్వర్ సరిగా పని చేయకపోవడం వలన ఒక్కో దరఖాస్తుకు అధిక సమయం పడుతుండటంతో దరఖాస్తుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందజేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 13 నెలల పాలన తర్వాత మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. దాంతో రేషన్ కార్డులు అవసరమైన వారు మీ సేవా కార్యాలయాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడి దరఖాస్తు చేసుకుంటున్నారు.

అధిక ఫీజు వసూలు

అయితే దరఖాస్తుదారుల నుంచి మీసేవా కేంద్రాల నిర్వాహకులు అధిక మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో రూ. 100 మరి కొన్ని కేంద్రాల్లో రూ. 150 వరకు ఫీజు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

తాగి వాహనాలు నడిపిన పలువురికి జైలుశిక్ష

కాచిగూడ, ఫిబ్రవరి 12: మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురికి కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఇటీవల కాచిగూడ, బర్కత్‌పుర ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. బుధవారం నాంపల్లి 7వ జేఎఫ్ఎంసీ కోర్టులో వారిని హాజరుపరుచగా న్యాయమూర్తి నలుగురికి రెండు రోజుల జైలు, 4వ సారి మద్యం సేవించి పట్టుబడిన వ్యక్తికి 22 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు.తాగి వాహనాలు నడిపితే జైలుశిక్ష, జరిమానాతోపాటు లైసెన్స్‌కూడా రద్దవుతుందన్నారు.

గురుకుల్ విద్యాలయ పరిరక్షణకు ఐక్య పోరాటం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 12: గురుకుల విద్యాలయ పరిరక్షణ కోసం సమైక్యంగా పోరాటం చేసి సాధిస్తామని గురుకుల విద్యాలయ పూర్వ విద్యార్థి అందేలా అభిలాష్ అన్నారు. ఘట్‌కేసర్ పోస్టాఫీస్ వద్ద గురుకుల విద్యాలయానికి పూర్వవైభవం వచ్చేలా అభివృద్ధి చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ అబ